సాక్షి నల్లగొండ

శనివారం । 9 । ఆగస్టు । 2025



ఉద్యమంలా వన మహోత్సవం..

వన మహోత్సవాన్ని ఉద్యమం మాదిరిగా నిర్వహించనున్నట్లు ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. - 8లో



ప్రజాస్వామ్యం ఖూనీ

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**589.10** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**43,999** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**43,999** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**28,948** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**5,598** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**7,353** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

గుజరాత్ నుంచి నల్లగొండకు బ్యాలెట్ బాక్సులు

నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను గుజరాత్ రాష్ట్రం నుంచి తెప్పిస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో గ్రామ పంచాయతీ ఎన్నికలు వరుసగా నిర్వహించే అవకాశం ఉన్నందున జిల్లాలో ఉన్న బ్యాలెట్ బాక్సులు సరిపోయే అవకాశం లేదు. దీంతో గుజరాత్ నుంచి 4280 బ్యాలెట్ బాక్సులను తెప్పించారు. వాటిని శుక్రవారం నల్లగొండలోని జిల్లా పరిషత్ పాత భవనంలో భద్రపరిచారు. బ్యాలెట్ బాక్సులను జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు పరిశీలించారు.

రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పీజీ సెమిస్టర్ పరీక్షలను అధికారులు తనిఖీ చేశారు. యూనివర్సిటీలో పరీక్ష కేంద్రాలను వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్ రెడ్డి పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



శివనేనిగూడెంలో కాలనీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

చిట్యాల : వానాకాలం వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తగు ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ సూచించారు. చిట్యాల పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలో ఇటీవల డెంగీ వ్యాధి సోకిన ఇంటి పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైడే నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డీఎంఓ ప్రదీప్, డాక్టర్ ఈసం వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ నర్సింహారావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

హాలియా : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ బొల్లారం భిక్షపతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన హైజెనిక్ ఆహార పదార్థాలను అందించాలని స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. స్టోర్, కిచెన్, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తూ గుణాత్మకమైన విద్యను అందించాలని సూచించారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నిత్యారాధనలో భాగంగా ఆండాళ్‌దేవికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

వరలక్ష్మీ వైభవం



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామార్చన, కుంకుమార్చన, మంగళహారతి తదితర పూజలు చేశారు. ఆలయాల్లో సామూహిక వ్రతాలు చేశారు.



మర్రిగూడలో అమ్మవారికి అభిషేకం చేస్తున్న మహిళలు



నల్లగొండలోని సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

64,884 మందికి రేషన్ కార్డులు

- పూర్తయిన పంపిణీ ప్రక్రియ
- కొత్త కార్డులకు సెప్టెంబర్ నుంచి సన్న బియ్యం



నల్లగొండ: కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఎట్టకేలకు పూర్తయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డుల పంపిణీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అయితే వాటన్నింటిని పరిశీలించి గతనెల 14వ తేదీన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం నియోజక వర్గాల వారీగా ఎమ్మెల్యేల చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తంగా 72,100 మంది కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోగా 64,884 దరఖాస్తులను అప్రూవల్ చేసి లబ్ధిదారులకు అందించారు. మిగతావి వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

పేర్లు చేర్చేందుకు 87,122 అర్జీలు

రేషన్ కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు 87,122 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 82,185 దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉండడంతో వాటిల్లో కొత్తగా పేర్లు చేర్చారు. మిగతావి ఆర్‌ఐ, తహసీల్దార్, డీఎస్‌ఓ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. రేషన్ కార్డులేని అర్హులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హతల ప్రకారం కొత్త కార్డు మంజూరు చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

సెల్ఫీ.. విత్ రాఖీ



అన్నాచెల్లెల్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ. శనివారం రాఖీ పండుగ జరుపుకునేందుకు మీరు సిద్ధమయ్యారా.. మీ ఫొటోలను 'సాక్షి'లో చూసుకోవాలనుకుంటున్నారా.. మరి ఎందుకు ఆలస్యం.. మీ సోదరీమణులతో రాఖీలు కట్టించుకుంటూ సెల్ఫీ తీసుకున్న ఫొటోలను 'సాక్షి'కి పంపిస్తే ఆదివారం సంచికలో ప్రచురిస్తాం.

'రాఖీ' సెల్ఫీ ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నం.
89789 63674

విధులకు వెళ్లకుండా ఫేక్ అటెండెన్స్!

- 69 మంది కార్యదర్శులను గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ
- షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చిన కార్యదర్శులు
- క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్న జిల్లా కలెక్టర్



నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్ వ్యవహారం నల్లగొండ జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. జిల్లాలో 69 మంది పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరు కాకుండానే అటెండెన్స్ వేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్రస్థాయిలో గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ వారి వివరాలను జిల్లా అధికారులకు పంపించి చర్యలకు ఆదేశించింది. దీంతో ఫేక్ అటెండెన్స్‌కు పాల్పడ్డ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయడం.. అందుకు వారు సమాధానం కూడా ఇచ్చారు. త్వరలోనే వారిపై కలెక్టర్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఉదయం 9.30 గంటలకు హాజరు వేయాలి

జిల్లాలో పాత గ్రామ పంచాయతీలు 844 ఉన్నాయి. వాటి పరిధిలో పని చేసే పంచాయతీ కార్యదర్శులు రోజూ ఉదయం 9.30 గంటలకు ఆయా గ్రామాలకు వెళ్లి ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయాలి. కానీ.. కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతూ ఫేక్ అటెండెన్స్ వేసి పంచాయతీరాజ్ శాఖను మోసం చేస్తున్నారు. ఇలా జిల్లాలో 69 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా మారుమూల ప్రాంతాల గ్రామాలకు చెందిన వారే ఉండడం గమనార్హం.

యాప్‌లోనే లొసుగులు

ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు కోసం యాప్‌ను రూపొందించి అమలు చేస్తోంది. కానీ ఆ యాప్‌లో పలు లొసుగులు ఉన్నాయి. యాప్‌లో ఉద్యోగి ఆధార్‌కు అనుసంధానం లేదు. దానికి తోడు ఎవరి ఫొటో పెట్టినా అటెండెన్స్ పడుతుంది. దీంతో కార్యదర్శులు ఆ గ్రామంలో పనిచేసే కార్మికుల సెల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి కార్యదర్శుల పాస్ ఫొటోలను వారికి ఇవ్వడంతో వీరు విధులకు వెళ్లని రోజు కార్మికులే వీరి పాస్‌ఫొటోను చూపి అటెండెన్స్ వేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

పంచాయతీ కార్యదర్శులు రోజూ ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరువేస్తారు. వారి హాజరును పరిశీలించాల్సింది ఎంపీఓ. సదరు అధికారి రోజూ 2, 3 గ్రామాలు వెళ్లి పరిశీలించాలి. కానీ జిల్లాలో అధికారులు ఫేక్ అటెండెన్స్‌లు గుర్తించలేదు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్‌కు పాల్పడ్డట్లు స్పష్టమవుతోంది.

క్రిమినల్ చర్యలకు అవకాశం..

జిల్లాలో తప్పుడు పద్ధతిలో అటెండెన్స్ వేసిన 69 మంది కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. వాటికి కార్యదర్శులు కూడా సమాధానం ఇచ్చారు. ఆ నివేదిక అంతా కలెక్టర్‌కు సమర్పించనున్నారు. సీసీఎల్‌ఏ నిబంధనల ప్రకారం కార్యదర్శులను సస్పెండ్ చేయవచ్చు. ఇంక్రిమెంట్ కట్ చేయడం, ఇతర క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అవకాశం కూడా ఉంది. దీనిపై త్వరలోనే కలెక్టర్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు పురోగతి తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఇల్లు మంజూరై నిర్మించుకు నేందుకు ఆర్థిక స్తోమత లేని వారిని గుర్తించి వారికి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్ల పురోగతిని పరుగులు పెట్టించాలని అధికారులకు సూచించారు. జాబితాలో అర్హులైన వారిని చేర్చాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీఓ రమణారెడ్డి, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఉన్నారు.

మైనార్టీల ఓట్ల తొలగింపు సరికాదు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : బిహార్ రాష్ట్రంలో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలల ఓట్లు తొలగింపు సరికాదని.. ఓట్ల తొలగింపు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని అడ్డదారిలో లక్షల ఓట్లను తొలగిస్తోందన్నారు. బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్‌డీఏ కూటమికి ఓట్లు వేయరని భావించి 65లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్, జగదీశ్చంద్ర, సత్యనారాయణరావు, రవినాయక్, పరుశురాములు, తిరుపతి రామ్మూర్తి, అరుణ, ఊర్మిళ, గోవర్ధన, దేవయ్య, సైదులు, అప్పారావు, వెంకటేశ్వర్లు, వదూద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ముంచెత్తిన వాన

జిల్లా అంతటా జోరు వర్షం

- శాలిగౌరారంలో అత్యధికంగా 14.1 సెంటీమీటర్లు నమోదు
- పలుచోట్ల పొంగిన వాగులు.. రాకపోకలకు అంతరాయం
- పత్తి చేలలో నిలిచిన నీరు



శాలిగౌరారం వద్ద కాల్వ కట్ట తెగిపోవడంతో నీటమునిగిన వరి చేలు, పొలాల్లో వేసిన ఇసుక మేట

పెద్దవూర, తిరుమలగిరి(నాగార్జునసాగర్), త్రిపురారం : అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సగటున 31.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శాలిగౌరారం మండలంలో 14.1 సెంటీమీటర్ల వర్షం కురవగా.. అత్యల్పంగా నాంపల్లి మండలంలో 8.0 మిల్లీమీటర్ల వాన కురిసింది. వర్షంతో పలుచోట్ల పత్తి చేలలో నీరు చేరింది. వాగులు, వంకలు పొంగాయి. దీంతో లోలెవల్ వంతెనల పైనుంచి వరద నీరు పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే.. మొన్నటి వరకు వేసవిని తలపించేలా ఎండలు ఉండటంతో పత్తి, మిరప చేలు వాడు దశకు చేరుకున్నాయి. ఈ వర్షంతో పంటలకు డోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీటమునిగిన చేలు

- పెద్దవూర మండలంలో కురిసిన భారీ వర్షంతో మండలంలోని పెద్దవూర, నాయినివానికుంట, సంగారం, పోతునూరు చెరువులు అలుగులు పోస్తున్నాయి. పెద్దవూర–పర్వేదుల రహదారిపై మండల కేంద్రంలో చిన్నవాగుపై ఉన్న వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో నీటిలోనుంచే పశువులు, వాహనాలు వెళ్లాల్సి వచ్చింది.
- తిరుమలగిరి సాగర్‌లో సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. మండలంలో చాలా గ్రామాల్లో పత్తి, వరి పంటలు నీటమునిగాయి. పత్తి పంట చెరువును తలపించేలా మారాయి.
- త్రిపురారం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రం నుంచి కుక్క డం వెళ్లే రహదారిలో బాబుసాయిపేట వద్ద తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

శాలిగౌరారంలో కుండపోత

శాలిగౌరారం : మండలంలో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో అలుగు పోస్తున్నాయి. వరదలకు మండల కేంద్రంలో కాల్వలకు గండ్లు పడటంతో వరి పంటకు నష్టం వాటిల్లింది. మండలంలోని ఊట్కూర్, మాదారం కలాన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఊట్కూర్ వద్ద కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో మండలంలోని ఊట్కూర్, మాదారం కలాన్, పెర్కకొండారం, ఇటుకలపాడ్, వంగమర్తి గ్రామాలకు మండల కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. ఊట్కూర్ నుంచి బండమీదగూడెం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో బండమీదగూడెం వెళ్లడం కష్టతరంగా మారింది. నకిరేకల్ మండలం చందుపట్లకు చెందిన ముగ్గురు తాపీమేస్త్రీలు ఊట్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముగించుకుని బైక్‌పై తిరిగి వెళుతుండగా ఊట్కూర్ మాదారం కలాన్ గ్రామాల మధ్య కాజ్‌వేపై వరద నీటిలో కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులు వారిని తాళ్ల సాయంతో బయటకు లాగి ప్రాణాపాయం తప్పించారు. శుక్రవారం ఉదయం బైక్‌ను జేసీబీ సాయంతో బయటకు తీశారు.



అలుగుపోస్తున్న అడ్లూరు పెద్ద చెరువు



త్రిపురారం : బాబుసాయిపేట వద్ద తెగిన తాత్కాలిక వంతెన

వర్షపాతం వివరాలు ఇవీ..

నల్లగొండ టౌన్ : చిట్యాల 49.1మి.మీ., నార్కట్‌పల్లి 35.5, కట్టంగూర్ 60.3, నకిరేకల్ 42.5, కేతేపల్లి 31.9, తిప్పర్తి 11.9, నల్లగొండ 47.5, కనగల్ 15.2, అనుముల హాలియా 41.7, నిడమనూరు 26.8, త్రిపురారం 36.8, మాడ్గులపల్లి 25.5, వేములపల్లి 59.1, మిర్యాలగూడ 15.8, దామరచర్ల 24.5, అడవిదేవులపల్లి 45.4, తిరుమలగిరి సాగర్ 26.7, పెద్దవూర 37.8, చింతపల్లి 19.5, గుర్రంపోడు 11.5, పీఏపల్లి 26.8, నేరడుగొమ్ము 10.8, కె.మల్లేపల్లి 16.8, దేవరకొండ 27.6, గుండ్లపల్లి 56.9, చందంపేట 18.0, గుడిపల్లి 17.7, మునుగోడు 22.8, చండూరు 21.6, గట్టుప్పల్ 10.3, మర్రిగూడ మండలంలో 9.4 మిలీమీటర్ల వర్షం కురిసింది.

ఎన్నెస్పీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎడమకాల్వ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం : భారీ వర్షాలు కురుస్తున్నందున వరదలు వచ్చే అవకాశం ఉంటుందని ఎన్నెస్పీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ వద్ద కంపాసాగర్ పరిధిలో సాగర్‌ఎడమ కాలువకు ఉన్న ఎమర్జెన్సీ గేట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దదేవులపల్లి చెరువు విస్తీర్ణం, నీటి సామర్థ్యం, ఎమర్జెన్సీ గేట్ల పనితీరుపై ఆరా తీశారు. వరదలు వచ్చినప్పుడు ఏ విధమైన చర్యలు తీసుకుంటారని తెలుసుకున్నారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎన్నెస్పీ డీఈ గోపీనాథ్, తహసీల్దార్ గాజులు ప్రమీల, ఎంపీడీఓ విజయకుమారి, ఎన్నెస్పీ ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

ఎడమకాల్వ పరిశీలన

హాలియా : భారీ వర్షాలు వస్తే అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటిని నియంత్రించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాలియాలోని 17వ మైలురాయి వద్ద ఎడమకాల్వను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్‌కు పంపించాలన్నారు.

లారీని ఢీకొట్టిన కారు..

● నలుగురికి స్వల్పగాయాలు

మునగాల: మండల కేంద్రం శివారులో స్థానిక భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం విజయవాడ నుంచి హైద్రాబాద్ వెళ్లే కారు అతివేగంతో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న ఓ కుటుంబానికి చెందిన నలుగురు ప్రయాణీకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరచుకోవడంతో నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు.

రాఖీ పండుగకు వస్తూ..

● రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి
● మరొకరికి తీవ్రగాయాలు

రామగిరి(నల్లగొండ): రాఖీ పండుగకు సొంతింటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. నల్లగొండ పట్టణంలోని సాగర్‌రోడ్డు ముత్యాలమ్మ కాలనీకి చెందిన సోదరులు గంటకంపు నాగరాజు, మణికంఠ హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తారు. నల్లగొండలో ఉంటున్న సోదరిచే రాఖీ కట్టించుకునేందుకు శుక్రవారం హైదరాబాద్ నుంచి నల్లగొండ బైక్‌పై బయలుదేరారు. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు గిరకబాయిగూడెం శివారులో ఎదురుగా డీసీఎం వాహనం అజాగ్రత్తగా అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న నాగరాజు(26) ప్రమాద స్థలంలోని మృతిచెందాడు. సోదరుడు మణికంఠకు కుడికాలు, చేయికి గాయాలు అయ్యాయి. తల్లి గంటకంపు అరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబు చెప్పారు.

కూలి పనికి వెళ్తుండగా గుండెపోటుతో మహిళ మృతి

నకిరేకల్: కూలి పనికి వెళ్లేందుకు అడ్డామీదకు వచ్చిన మహిళకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడే ప్రాణాలు విడిచింది. ఈ సంఘటన శుక్రవారం నకిరేకల్‌లో చోటుచేసుకుంది. కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన చందుపట్ల తిరుపతమ్మ(45) రోజు వారీ కూలీ పనికోసం శుక్రవారం ఉదయం నకిరేకల్‌లోని ఇందిరాగాంధీ చౌరస్తా సెంటర్‌కు వచ్చింది. ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా సాక్షి నిర్వహించిన 'వరలక్ష్మి సెల్ఫీలకు ఆహ్వానం'కు విశేష స్పందన లభించింది. వరలక్ష్మి పూజలో కూర్చున్న మహిళలు సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..



శిరీష, నల్లగొండ | భాగ్యలక్ష్మి, నల్లగొండ | చలమల్ల సునీత, నల్లగొండ | చెరుపల్లి ఉషా, మిర్యాలగూడ | యాదమ్మ, రోజా, నల్లగొండ | సువర్ణ, నిడమనూరు



గున్న అరుణ, అల్కాపురి కాలనీ, నల్లగొండ | గుంటోజు శివపార్వతి, నిడమనూరు | కత్తి సంధ్య, హాలియా | కోయల్కర్ యశోధాబాయ్, అయ్యప్పనగర్, దేవరకొండ | కూనూరి స్వాతి, చిట్యాల | లావణ్య, కేతేపల్లి | మిర్యాల చంద్రకళ, రంగారెడ్డినగర్, నకిరేకల్ | మొదుగు విశాల, మిర్యాలగూడ | నారగోని పారిజాత, డాక్టర్స్‌కాలనీ, నకిరేకల్



లక్ష్మీ, చైతన్య నగర్, మిర్యాలగూడ | పుష్ప, రాక్‌హిల్స్ కాలనీ, నల్లగొండ | రాజ్యలక్ష్మీ, రవీంద్రనగర్, మిర్యాలగూడ | రమాదేవి, పానగల్, నల్లగొండ | సుష్మా, న్యూ తిరుమల్ నగర్, నల్లగొండ | తీగలపాటి సంధ్య, నకిరేకల్ | తాడోజు ధనలక్ష్మి, శివాజీనగర్, నల్లగొండ | వడ్డేపల్లి శ్రీమహాలక్ష్మీ, జమ్మలగూడ, నల్లగొండ



కత్తుల సుజాత, శాంతి నగర్, నల్లగొండ | సట్టు సునీత, శ్రీనగర్‌కాలనీ, నల్లగొండ | ఉషారాణి, శ్రీనగర్‌కాలనీ, నల్లగొండ | హారిక, కొండమల్లేపల్లి | బసవ మానస, బృందావన్ కాలనీ, నల్లగొండ | చిత్తలూరి పవిత్ర, నెమ్మాని, నకిరేకల్ | నాగిళ్ల రాజేశ్వరి, చిట్యాల | సింధూజ, శ్రయశ్రీ, నిడమనూరు

వన మహోత్సవం ఉద్యమంలా నిర్వహిద్దాం

● ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ (ఎస్ఎస్‌పీసీ) 2025 హరిత్ ద వే ఆఫ్ లైఫ్ పోస్టర్‌ను శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా శాఖ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ పర్యావరణ విద్యా విధానంలో భాగంగా సామాజిక ఉద్యమం మాదిరిగా వన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థుల చేత మొక్కలు నాటించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఆకుల రవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ కరపత్రాల ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్: గణితశాస్త్రం దాని అనువర్తనాలపై వచ్చే నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ కాన్ఫరెన్స్ కరపత్రాలను శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సెమినార్లు, సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన పెరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు కావాల్సిన ఏర్పాట్లలో యూనివర్సిటీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ గణిత విభాగ అధిపతి, మద్దిలేటి పసుపుల, బోర్డాఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకురాలు హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ కేసులో ఆర్ఎంపీ అరెస్టు

● ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన కేసులో ఆమెకు లింగ నిర్ధారణ పరీక్ష చేసిన ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు. మే 24న మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష అనే గర్భిణి నకిరేకల్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు బాత్క యాదగిరి వద్ద లింగనిర్ధారణ పరీక్ష చేయించుకుంది. ఆడపిల్ల అని తేలడంతో ఆమె భర్త నగేష్ మరో ఆర్ఎంపీ జానయ్య, వారి బంధువు సందీప్ కలిసి ఆమెను సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అర్హత లేని వైద్యులతో అబార్షన్ చేయించారు. అధిక రక్తస్రావం కావడంతో ఆమెను ఖమ్మంలోని మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. ఈవిషయమై డీఎంహెచ్‌ఓ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆర్ఎంపీ బాత్క యాదగిరిని నకిరేకల్‌లోని తన నివాసంలో పట్టణ పోలీసులు అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం 10 మందిపై కేసు కాగా కొంత మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుడు యాదగిరి వద్ద ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన భూక్యా హనుమా నాయక్, సంగాల కాటంరాజు, నర్సారావుపేట జిల్లా కారంపుడికి చెందిన మద్దూరి చంటి గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. బలిమెల, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆనంద్‌గురు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరికి మిర్యాలగూడకు చెందిన కొందరు వ్యక్తులు పరిచయం కావడంతో వారి ద్వారా ఇక్కడకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. ఈక్రమంలో గురువారం భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, మద్దూరి చంటి రెండు గ్రూపులుగా విడిపోయి చంటి బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వచ్చి ఐదున్నర కిలోల గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. మద్దూరి చంటి, మిర్యాలగూడకు చెందిన షేక్ రియాజ్, మహమ్మద్ హర్షత్ అయాబ్, మహ్మద్ సలీం అక్బర్, మహమ్మద్ జునైద్ అలీ, షేక్ అఫ్రోజ్, కుర్ర సందీప్ ఖానాపురం శరత్‌లను అరెస్టు చేశామని.. భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, ఆనంద్‌గురు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల వద్ద 7.4 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సీఐ సోమనర్సయ్య, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, టూటౌన్ ఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.యాదగిరి రెడ్డి, కానిస్టేబుళ్లు ఎల్.సూర్య, పి.బాలకృష్ణ, ఎండీ అక్బర్ పాష, జి.లక్ష్మయ్య, రాజశేఖర్, సమాద్, వెంకన్న, మహేష్, సైదులు, నాగరాజు, రాములునాయక్, సైదానాయక్ తదితరులున్నారు.

చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతు

వేములపల్లి: మూసీ వాగులో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. ఆమనగల్లుకు చెందిన మద్దెబోయిన వెంకన్నపార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం గ్రామంలో బోనాలు నిర్వహిస్తుండగా రామకృష్ణ(22) హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి మూసీ వాగు వద్ద చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టారు.

కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

మాడుగులపల్లి: మండలంలోని పెద్దదేవులపల్లి కాల్వలో గురువారం సాయంత్రం వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ప్రభాకరన్ పెద్దదేవులపల్లి రెడ్డీస్ ల్యాబ్‌లో సేఫ్టీ విభాగంలో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సెలవు కావడంతో తన ముగ్గురు స్నేహితులతో కలిసి పెద్దదేవులపల్లి కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రభాకరన్ ఈత కొట్టి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా కాలు జారి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్నేహితులు గమనించి అతడిని రక్షించే ప్రయత్నం చేసినా ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ప్రభాకరన్ స్నేహితుడు విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

లాభాల పూ'బంతి'

● తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
● మిరప, పత్తి పంటల్లో రక్షణ పంటగా బంతి పూల సాగు



పెద్దవూరలో సాగవుతున్న బంతి పూల తోట

పాడిపంట

పెద్దవూర: బంతి సాగును జూన్, జూలై, అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగు చేసేవారు. కానీ గత కొన్నేళ్లుగా రైతులు ఏడాది పొడవునా సాగు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో సాగు చేసిన బంతి సాగు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ, అక్టోబర్, నవంబర్ నెలలో సాగు చేసిన బంతిపూలు డిసెంబర్, జనవరితో పాటు ఫిబ్రవరిలో వచ్చే పండుగలు, పెళ్లిళ్లు, జాతరలు, ఫంక్షన్‌లకు దిగుబడి వస్తుండటంతో మంచి గిరాకీ వస్తుంది. రైతులు నీటి వసతిని బట్టి బంతిని సాగు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి మురళి తెలిపారు.

యాజమాన్యం రెండు రకాలు..

ఆఫ్రికన్ మేరీగోల్డ్ : ఈ జాతి ఎత్తుగా పెరిగి అతి పెద్ద సైజు పూలు పూస్తాయి. ఇందులో ఆఫ్రికన్ జెయింట్, ఆరెంజ్ డబుల్, ఆఫ్రికన్ ఎల్లోజెయింట్ డబుల్, క్రాక్ జాక్, గోల్డెన్ ఏజ్ రకాలు అనువైనవి.

ఫ్రెంచ్ మేరీగోల్డ్ : ఈ జాతి పూలకుండీల్లో పెంచుకునే రకాలు. దీనిలో రెడ్ బ్రోకేడ్, రెస్పిన్ రెడ్, బట్టర్ స్కాచ్, వాలెన్సియా రకాలు అనువైనవి.

నేలలు: నీరు త్వరగా ఇంకిపోయే తేలిక పాటి సారవంతమైన నేలలు, ఇసుక నేలలు, నీటి తేమ తక్కువగా ఉండే నేలలు బంతి సాగుకు అనుకూలం. బంతిని మిరప, పత్తి పంటల్లో రక్షక పంటగా కూడా సాళ్లలో సాగు చేసుకోవచ్చు.

వాతావరణం: మన వాతావరణ పరిస్థితులు బంతిసాగుకు అనుకూలం. జూలై మధ్య కాలం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటితే మార్కెట్‌కు పూల సరఫరా సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చేయొచ్చు.

నారుమళ్లు: ఎకరానికి సరిపడ నారు పెంచడానికి 800-1000 గ్రాముల విత్తనం అవసరం. మళ్ల తయారు చేసుకునే సమయంలో ఒక చదరపు మీటరుకి 8-10 కిలోలు బాగా చిలికిన పశువుల ఎరువు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి చల్లితే చీమలు, చెదలు వంటి ఇతర క్రిముల నుంచి రక్షణ పొందవచ్చు. ఎత్తు నారుమళ్లు చేసుకుని విత్తనాన్ని సాళ్లలో నాటుకుంటే మొక్కల మధ్య దూరం సమంగా ఉండి నారు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దీనివలన కలుపు మొక్కలు, చీడపీడల నివారణ కూడా వీలవుతుంది. విత్తిన 5-7 రోజుల్లో మొలకలు వస్తాయి.

నాటే విధానం: 15-20 రోజుల వయసు లేదా 3-4 ఆకులు వచ్చిన మొక్కలను 45×25 సెంటీమీటర్ల దూరంలో నాటితే మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండి పూల దిగుబడి పెరుగుతుంది. నారుని సాయంకాలం నాటుకుంటే బాగా పాతుకుంటాయి. ఆఫ్రికన్ మొక్కల్ని 40×30 సెంటీమీటర్ల దూరంలోనూ, ఫ్రెంచ్ బంతి మొక్కల్ని 20×20 సెంటీమీటర్ల దూరంలో నాటితే పూల దిగుబడి బాగా ఉంటుంది. నాటిన తర్వాత పల్చగా నీరు పెట్టుకోవాలి.

ఎరువులు: ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 టన్నుల చొప్పున బాగా చిలికిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. దీనితోపాటు 20-40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 35 కిలోల పోటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. మొక్కలు నాటిన 60 రోజుల వరకు శాఖీయంగా పెరిగే దశలో ఉంటాయి. ఈ సమయంలో తగినంత తేమ ఉండేలా చూడాలి. నేల స్వభావాన్ని బట్టి 5-8 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి.

కత్తిరింపులు: వాణిజ్యపరంగా పెంచే ఆఫ్రికన్ బంతి రకాలు ఎత్తుగా పెరిగి చాలా తక్కువగా పూలు వస్తాయి. కనుక మొక్కలు 30-40 సెంటీమీటర్ల ఎత్తులో లేదా నాటిన 30-35 రోజులకు తల భాగం కత్తిరిస్తే మొక్క కింది భాగం నుంచి పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూల దిగుబడి పెరుగుతుంది.

సస్యరక్షణ:

నారుకుళ్లు తెగులు: నేలలో తడి ఎక్కువగా ఉండి వెచ్చని వాతావరణంలో ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. మొలకెత్తిన నారు మొక్కల కాండం కుళ్లి చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేదా 1.5 గ్రాముల కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణంతో నారు మడిని తడిపి నివారించవచ్చును.

మొగ్గ తొలిచే పురుగు: లార్వాలు పూమొగ్గలను తొలుస్తాయి. పూ మొగ్గలు విచ్చుకోవు. పూల దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కార్బరిల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పేను: పెద్ద, పిల్ల పురుగులు మొగ్గల్ని ఆశించి నష్టపరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు మలాథియాన్ లేదా 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగులు: పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి. ఇవి ఆశించిన మొగ్గలు గోధుమరంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ ను కలిపి పిచికారీ చేయాలి.

రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తున్న నిందితుల రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన ఐదుగురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, అర్బన్ బాలాజీ నగర్‌కు చెందిన కొమ్మలపాటి శ్రీనివాస్, గుంటూరుకు చెందిన వెంకసుబ్బారావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డి, నరసారావుపేటకు చెందిన రమేష్, సుకిల శ్రీనివాస్, యాటకూరుకు చెందిన నాగసాయి, గుజరాత్‌కు చెందిన మన్సూక్ బాయి, మనుబాయి మక్వన మొత్తం ఎనిమిది మంది ముఠాగా ఏర్పడ్డారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని రాష్ట్రం దాటించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి వ్యాపారం సాఫీగా జరగడానికి వారు పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డికి నెలకు రూ.3లక్షలు ఇస్తే.. అతడు లోడింగ్, అన్‌లోడింగ్, చెక్‌పోస్టులు దాటించేవాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు రమేష్, వాసు, శ్రీనివాసు అనే వ్యక్తులు కొంత కమీషన్ తీసుకుని సహకరించేవారు. ఈ క్రమంలో ఈ నెల 5న లారీలో 300 క్వింటాళ్ల రేషన బియ్యం లోడు చేసుకుని వస్తున్న క్రమంలో వాడపల్లి ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడ్డారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, త్రిపురారం ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.